సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 13 । నవంబర్ । 2024

కొనసాగుతున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



కడప డీఎస్‌ఏ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ మంగళవారం ఉత్సాహంగా కొనసాగింది. అభ్యర్థులకు జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యాలయంలో వసతి సౌకర్యం కల్పించారు. రిజిస్ట్రేషన్ మొదలు పరుగు పందెం . లాంగ్‌జంప్, హైజంప్,జిగ్‌జాగ్ బ్యాలన్స్ క్రీడాంశాల్లో అభ్యర్థుల ప్రతిభను పరీక్షించారు. ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ ఎంపికలను పర్యవేక్షించారు. -కడప స్పోర్ట్స్

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/25.6

జిల్లాలో మంగళవారం 25.6 - 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

16న పాలస్తీనా సంఘీభావ సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ఈనెల 16 న పాలస్తీనా సంఘీభావ సభను నిర్వహించనున్నట్లు కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ నాయకులు ఇసాక్ అలీ సయ్యద్ అహ్మద్ బాబు బాయ్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో సంఘీభావ సభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలస్తీనాపై పదమూడు నెలలుగా ఇజ్రాయిల్ నానా రకాలుగా అక్కడి ప్రజలపై దాడులు నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ యుద్ధాలను ఖండించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అబ్దుల్లా షబ్బీర్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఆర్వో



కలెక్టర్‌ను కలిసిన నూతన డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా రెవెన్యూ అధికారిగా ఎం.విశ్వేశ్వరనాయుడు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 1995 బ్యాచ్‌లో ప్రొబెషనరి డిప్యూటీ తహసీల్దార్‌గా ఆయన ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత వివిధ జిల్లాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఏపీ సీఆర్‌డీఏలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ ఇక్కడికి డీఆర్వోగా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా విధులు నిర్వర్తిస్తానన్నారు. అంతకుముందు కలెక్టర్ శ్రీధర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

ముగ్గురు ఎమ్మెల్యేలకు విప్‌లుగా అవకాశం

కడప రూరల్: ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌లుగా అవకాశం లభించింది. అసెంబ్లీలో మొత్తం 15 మంది విప్‌లకు గాను ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో తెలుగుదేశం పార్టీ నుంచి కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, భారతీయ జనతా పార్టీ నుంచి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జనసేన నుంచి రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లకు అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌లుగా అవకాశం లభించింది.



మాధవి రెడ్డి



ఆదినారాయణ రెడ్డి



అరవ శ్రీధర్

క్యాంపస్ ఇంటర్వ్యూలలో విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, తదితరులు

వేంపల్లె: ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో విద్యార్థులు ప్రతిభ చూపి ఉద్యోగాలు పొందినట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అంచల కంపెనీ, అంపేర కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. అంచల కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో పైనలియర్ సీఎస్సీ చదువుతున్న 10 మంది విద్యార్థులకు ఉద్యోగాలు రాగా.. ఎల్‌పీఏ ప్యాకేజీ కింద ఏడాదికి రూ.4.50లక్షల జీతం, అలాగే అంపేర కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలలో నలుగురు సీఎస్సీ విద్యార్థులు ఉద్యోగాలు రాగా.. ఎల్‌పీఏ ప్యాకేజీ కింద ఏడాదికి రూ.5లక్షల జీతాలు ఉంటాయని వివరించారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఆర్జీయూకేటీ రిజిస్టర్ అమరేంద్ర కుమార్, డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, ప్లేస్ మెంట్ కో.ఆర్డినేటర్ కేతినేని వినోద్ అభినందించారు.

మ్యూజియం మూలకేనా!

- ఏళ్లుగా మూతపడి విద్యార్థులకు అందని సైన్సు పరిజ్ఞానం
- పాడైపోయిన లక్షల విలువ చేసే సైన్సు పరికరాలు
- మ్యూజియం అభివృద్ధికి నిధులు విడుదలైనా ఖర్చు చేయని వైనం



గదిలో ఓ మూలన నిరుపయోగంగా సైన్సు సంబంధిత సబ్జెక్టు పుస్తకాలు



ఆరుబయట పడేసిన సైన్సు మ్యూజియం వస్తువులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని సైన్సు మ్యూజియానికి గ్రహణం పట్టింది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సైన్సుపై భయం పోగొట్టి ప్రయోగాలపై ఆసక్తిని పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ మ్యూజియం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా విద్యార్థుల్లో సైన్సుపై ఆసక్తి పెంచి భావి భారత శాస్త్రవేత్తలుగా తయారు చేయడం మ్యూజియం ఏర్పాటు ముఖ్య ఉద్దేశం. ఇప్పుడా ఉద్దేశం నీరుగారుతోంది. ఏళ్ల తరబడి మూతబడి.. పరికరాలు మూలనబడి పిల్లలకు సైన్సు పరిజ్ఞానం అందకుండానే పోతోంది.

- కడప నగరం చెన్నూరు బస్టాండ్‌లో 15 ఏళ్ల క్రితం ఈ సైన్సు మ్యూజియం ఏర్పాటు చేశారు. అప్పట్లో సైన్సు మ్యూజియంలో పలు రకాల ప్రయోగాల నిర్వహణ, సైన్సు డేలు, జాతీయ నాయకులు దినోత్సవాలు, టీచర్లకు వర్కుషాపుల కార్యక్రమాలను రెగ్యులర్‌గా నిర్వహించేవారు.

నిధులు విడుదలైనా ...

గతంలో నిధులు సరిగా రాక అధికారులు పట్టించుకోక సైన్సు, మ్యూజియంలో పరికరాలన్నీ మూలకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులకు ప్రాక్టికల్ సైన్సు పరిజ్ఞానం దూరమైన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ జిల్లా సైన్సు మ్యూజియం అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రూ.12 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ తర్వాత నిధులు విడుదల అయ్యాయి. అప్పటి నుంచి నిధులు మురిగిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలి

కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఈ సైన్సు మ్యూజియంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సైన్సు ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు వేడుకుంటున్నారు. ఈ విషయంపై డీఈఓ మీనాక్షిని వివరణ కోరగా తాను ఇటీవలే వచ్చాను. పరిశీలించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు.

▶▶ సైన్సు మ్యూజియంలో సచివాలయాల ఏర్పాటు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు పాలన దగ్గర చేసి ప్రతి ఒక్కరికి నాణ్యమైన సేవలను అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. దీంతో కడప నగరంలోని డివిడిజన్లలో సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు పుర సేవలను సేవలందించేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తూ కడప నగరంలోని 29,31వ వార్డులకు సంబంధించి సచివాలయాలతో పాటు దానికి అనుబంధంగా ఉన్న ఆధార్ కేంద్రాన్ని కలిసి నిబంధనలకు విరుద్ధంగా అన్ని ఒకే చోట ఈ సైన్సు మ్యూజియంలో ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం తీసకున్న నిర్ణయంతో ఇటు సైన్సు మ్యూజియానికి గ్రహణం పట్టడంతో పాటు.. ప్రజలకు సచివాలయ వ్యవస్థ మీద నమ్మకం పోయే విధంగా ఉందని పలువురు విమర్శలు చేస్తున్నారు.



కడప సైన్సు మ్యూజియంలో నిర్వహిస్తున్న వార్డు సచివాలయాలు

వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవాలు ప్రారంభం

- ప్రత్యేక పూజలు
- ఘనంగా ఏర్పాట్లు



విద్యుత్ దీపాల అలంకరణలో బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాన ప్రబోధకర్త, సంఘ సంస్కర్త, సజీవ సమాధి నిష్ఠ వహించిన మద్విరాట్ శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం స్వామి వారి సుప్రభాతం, ఉపనిషత్ పారాయణం, గణపతి పూజలు, సాయంత్రం వేదస్వస్తి పంచసూక్త పారాయణం నిర్వహించి, అంకురార్పణ చేశారు. ఉత్సవాల బ్రహ్మంగారిమఠంలోని ఆలయాలు ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో కళకళలాడుతున్నాయి.

ప్రత్యేక పూజలు

మఠం ఆవరణలో ఏర్పాటు చేసిన 416 కలశాలకు తహసీల్దార్ దామోదర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, వేద పండితులు పాల్గొన్నారు. అనంతరం మఠం పూర్వపు మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వరస్వామి కుమారులు వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, వీరంబొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి అవతరించి 416 ఏళ్లు

శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి అవతరించి నేటి(బుధవారం)తో 416 ఏళ్లు అయింది. స్వామి అవతరించిన రోజు సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 416 కలశాలతో భక్తులు భారీగా ఊరేగింపుతో సమీపంలోని పార్కులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి శిలా విగ్రహానికి పూర్వపు మఠాధిపతి కుమారులచే క్షీరాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేస్తారు. రాత్రి గోవింద మాంబ వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తారు. కార్యక్రమాల నిర్వహణ కోసం మఠం ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ పర్యవేక్షణలో మేనేజర్ ఈశ్వరాచారి ఏర్పాట్లు చేశారు.

అన్నదానం: జయంత్యుత్సవాల సందర్భంగా 11 ఏళ్లుగా తమిళనాడుకు చెందిన వీరబ్రహ్మేంద్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి నివాసం వీధిలో ఏర్పాటు చేసిన అన్నదాన కేంద్రంలో భక్తులకు రెండు రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తున్నారు. మఠం ఆవరణలో కూడా అన్నదానం ఉంటుంది. తోట్లపల్లె, గంగిరెడ్డిపల్లె గ్రామాలలో కూడా నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూర్వపు మఠాధిపతి కుమారులు

బుకింగ్ కేంద్రాల్లో ఇసుక పంపిణీ

- కంట్రోల్ నెంబరు 08562 246344
- డీఎల్‌ఎస్‌సీ సమావేశంలో కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో నిర్దేశించిన బుకింగ్ కేంద్రాల్లో సజావుగా ఇసుక పంపిణీ జరగాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం ఏడు ఇసుక రీచ్‌లు, రెండు డీసెల్టేషన్ పాయింట్ల వద్ద దాదాపు పది లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు. ఇసుక రేవులు, స్టాక్ పాయింట్ల వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధరల వివరాలను బోర్డుల ద్వారా తెలియజేయాలన్నారు. గ్రామ స్థానిక అవసరాల కోసం ఉచితంగా ఇసుకను తీసుకెళ్లే వారి, వాహనాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలన్నారు. ఆర్డీవోలు తమ పరిధిలోని స్టాక్ రీచ్‌లను తనిఖీ చేసి అక్కడి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలన్నారు. అలాగే రియల్టర్లు, బిల్డర్లతో ఉచిత ఇసుక విధానంపై సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇసుక పంపిణీ ప్రక్రియ నియమ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక సరఫరా సంబంధిత అంశాలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే కంట్రోల్ రూము నెంబరు 08562 246344 తెలియజేయాలన్నారు. జేసీ అదితిసింగ్, గనులు భూగర్భ శాఖ డిడి సూర్యచంద్రరావు,జిల్లా పంచాయితీ అధికారి రాజ్యలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

8న వెనుకబడిన జిల్లాల సదస్సు

కడప సెవెన్‌రోడ్స్: వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సదస్సు డిసెంబరు 8వ తేది కడపలో నిర్వహించనున్నట్లు ఉక్కు సాధన ఐక్యవేదిక అధ్యక్షుడు నారాయణ, సీఆర్‌వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా విభజన చట్టంలోని కడప స్టీల్ ప్లాంటు నిర్మాణాన్ని ఇప్పటివరకు చేపట్టలేదని పేర్కొన్నారు. బడ్జెట్‌లో రూ.25 కోట్లు దీనికి కేటాయించడాన్ని బట్టిచూస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతి నిర్మాణంపై చూపుతున్న శ్రద్ధ వెనుకబడిన జిల్లాలపై లేదని విమర్శించారు.

14 నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

కడప రూరల్: ప్రారంభ దశలోనే క్యాన్సర్ మహమ్మారికి అడ్డుకట్ట వేయడానికి ఈనెల 14వ తేదీ నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్‌సిడి 3.0 సర్వే కార్యక్రమంలో భాగంగా ఈనెల 14వ తేదీ నుంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సి హెచ్ ఓ, ఏఎన్‌ఎం, ఆశాలు ప్రతి ఇంటిని సందర్శిస్తారని అన్నారు. 18 సంవత్సరాలు పైబడిన స్త్రీ పురుషులకు బిపి, షుగర్, హిమోగ్లోబిన్, నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. 30 ఏళ్లు పైబడిన వివాహమైన స్త్రీలందరికీ గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. ఉచితంగా నిర్వహించే ఈ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

యూజర్లూ.. జర జాగ్రత్త

- సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటప్పుడు విజ్ఞతతో వ్యవహరించండి
- కుల,మతాల మధ్య విద్వేషాలు సృష్టించే పోస్టులు పెడితే చర్యలు
- మహిళలు, చిన్నారులపై అసభ్యకర, అభ్యంతకర పోస్టులు పెడితే సహించం
- అన్నమయ్య, కడప జిల్లాల ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



అన్నమయ్య, కడప జిల్లాల ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కడప అర్బన్: ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగాం, యూట్యూబ్, టెలిగ్రాం, తదితర సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేటపుడు విజ్ఞతతో వ్యవహరించాలని అన్నమయ్య, కడప జిల్లాల ఎస్పీ విద్యాసాగర్ నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా వ్యక్తిగత పేరుపైన ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెట్టొద్దని సూచించారు.

అదేవిధంగా సోషల్ మీడియా వేదికగా మతపరమైన, సున్నిత అంశాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు. అసభ్యకరమైన పోస్టులు పెట్టి వారిపై సైబర్‌సెల్ సోషల్ మీడియా విభాగంలో ప్రత్యేక నిఘా ఉంచామని సదరు చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై చర్యలు తప్పవన్నారు. అవాస్తవ ప్రచారాలను ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దనీ ఎస్పీ సూచించారు. ఫేక్‌న్యూస్ వ్యాప్తి లేదా ఫార్వర్డ్ చేసి వారిపై నిఘా ఉంచామని, నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వారిపై షేర్ చేసే వారిపై సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనాలోచితంగా పోస్టులు పెట్టడం వల్ల జరిగే కీడును గుర్తించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను ప్రత్యేక సైబర్ బృందం నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు. ఈ బృందం అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకుని 24/7 పర్యవేక్షణలో ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపైనా, వారిని ప్రోత్సహించే వారిపైనా చట్టపరంగా కఠినచర్యలు తప్పవని అన్నమయ్య, కడప జిల్లాల ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు నెటిజన్‌లను హెచ్చరించారు.

ఉరుసుకు పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్



మాట్లాడుతున్న రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్

కడప సెవెన్‌రోడ్స్: కడప పెద్దదర్గా (అమీన్ పీర్) ఉరుసు మహోత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి హర్షవర్ధన్ దర్గా ఉత్సవ కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఉరుసు నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టర్ శ్రీధర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూతోపాటు సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా 16, 17వ తేదీల్లో జరిగే గంధం, ఉరుసు ఉత్సవ ఘట్టాలకు లక్షలాది మంది భక్తులు, వీఐపీలు హాజరవుతారన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఉరుసు మహోత్సవాన్ని జరిపించడంలో పోలీసు శాఖ అన్ని రకాల భద్రత చర్యలను చేపట్టిందన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూట్ మ్యాపింగ్ చేసి సిబ్బందికి డ్యూటీలు కేటాయించినట్లు వెల్లడించారు. ఉరుసు సందర్భంగా ముఖ్యమైన ఐదు రోజులపాటు రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, దర్గా వరకు నగరంలోని అన్ని రూట్లను కవర్ చేస్తూ నిరంతరాయంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఉత్సవాల్లో భాగంగా దర్గా, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ దీపాలంకరణలో ఎక్కడా కూడా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా నిరంతర పర్యవేక్షణ జరగాలన్నారు. వీఐపీలు, ప్రొటోకాల్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కడప నగరంలో జరిగే అతిపెద్ద మహోత్సవాన్ని ప్రపంచం వీక్షించేలా.. సమాచార పౌర సంబంధాల శాఖ, మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పరిశుభ్రత ఏర్పాట్లను చూడాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అధిక సంఖ్యలో వైద్య సిబ్బందిని వైద్యాధికారులను నియమించి ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం శాఖల వారీగా చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు.

ఉరుసు మహోత్సవాల్లో ప్రధాన కార్యక్రమాలు

- ఈనెల 15న ఉదయం 8 గంటలకు సర్‌గిరోలు, ఫకీర్ల ఊరేగింపుతో దర్గా షరీఫ్ షరీఫ్‌నకు వచ్చి చదివింపులు ఇచ్చి వారి స్థానంలో బిస్తర్ చేస్తారు.
- 16న గంధం కార్యక్రమంలో భాగంగా ఉదయం దర్గా నుంచి బాదుల్లా సాహెబ్ మకాన్ వరకు పకీర్ల ఊరేగింపు సాంగ్యం, సాయంత్రం పీఠాధిపతులు దివ్యాసనం, ధ్యాన తపస్సు, రాత్రి గంధం ఊరేగింపు, ఫాతెహా సమర్పణ, ఖవాలీ కార్యక్రమాలు ఉంటాయి.
- 17న ఇదార-యే-అమీనియా చిస్తీయా వార్షిక నివేదిక. రాత్రి 9 గంటలకు ఉరుసు మహోత్సవం , గంధం ఊరేగింపు, చదివింపులు, ఖవాలీ
- 18న తహలీల్ ఫాతేహా కార్యక్రమంలో భాగంగా ప్రసాద సమర్పణ, సంబంధిత ప్రార్థనలు, రాత్రి 80వ ఉర్దూ కవి సమ్మేళనం (ముషాయిరా) జరుగుతుంది.
- 19న రాత్రి 10గంటల నుంచి తెల్లవారి 3 గంటల వరకు సమాఖానీ సజ్జదనషీన్ పీఠాధిపతి వారి ఆధ్వర్యంలో ఖవాలీ, ఖురాన్ పఠనం, తదితర కార్యక్రమాలు.
- 20న ఫకీర్లతో పీఠాధిపతులు వాటర్ గండిలోని హజరత్ మస్తాన్ స్వామివారి దర్శనం, జెండా ప్రతిష్ట
- 21న చివరిరోజు ఫకీర్ల సంఘాలకు జర్రా ప్రసాదం

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి



మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

ప్రొద్దుటూరు కల్చరల్: వచ్చే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.మీనాక్షి పేర్కొన్నారు. స్థానిక ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులకు సిలబస్ త్వరగా పూర్తి చేయాలని, పాఠ్యాంశాల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. త్వరలోనే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. ఏ పాఠశాలలోనైనా పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరిస్తానన్నారు. ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.